మరో ఇద్దరు ఆటో డ్రైవర్ల బలవన్మరణం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ)/భిక్కనూరు: మహిళల ఉచిత బస్సు పథకంతో గిరాకీ లేక, నెలవారీ కిస్తీలు చెల్లించలేక మనస్తాపం చెందిన మరో ఇద్దరు ఆటో డ్రైవర్లు తనువు చాలించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మౌలాలి హౌసింగ్ బోర్డు పరిధిలో కైలాసగిరికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీవన్ (24) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం రామేశ్వరపల్లికి చెందిన ఆటో డ్రైవర్ తుమ్మ శ్రీధర్ (38) ఈ నెల ఒకటిన గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలన్నింటికీ కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీఏటీయూ అధ్యక్షుడు వేముల మారయ్య హెచ్చరించారు.

అప్పుల బాధతో రైతు ..

జక్రాన్‌పల్లి, ఆగస్టు 8: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన రైతు కుంట రాజేశ్ (30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నాడు. పంట దిగుబడి సరిగా రాక.. పెట్టుబడి డబ్బులు మీదపడి రాజేశ్ అప్పుల పాలయ్యాడు. అప్పు తీర్చేందుకు మూడెకరాల భూమిని అమ్మాలనుకున్నాడు. ఆ భూమి ధరణిలో ఎక్కకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక రాజేశ్ తన వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు.. అర్గుల్ గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో వాయిస్ మెసేజ్ పెట్టాడు. భూమి తన పేరిట పట్టా కాలేదని, విక్రయానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఫలితంగా అప్పులు కట్టలేని పరిస్థితి వచ్చిందని, దీంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. ఎస్సై తిరుపతి కేసు దర్యాప్తు చేపట్టారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు

'స్థానికత'పై ప్రభుత్వం మేల్కోవాలి

- ఇప్పటికైనా సమగ్ర విధానం రూపొందించాలి
- జీవో 33పై అవసరమైతే న్యాయపోరాటం చేస్తాం
- పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించి స్థానికతను నిర్ధారించడంపై ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోవాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు ప్రభుత్వం జీవో 33 విడుదల చేసిన నేపథ్యంలో.. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును కలిశారు. ప్రభుత్వ అనాలోచిత జీవో వల్ల తమ పిల్లలు వైద్య విద్య చదివే అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేండ్ల నిబంధనవల్ల తెలంగాణలో పుట్టిన పిల్లలు సొంత రాష్ట్రంలోనే నాన్‌లోకల్ కావడం బాధగా ఉన్నదని గోడు వెల్లబోసుకున్నారు. న్యాయం జరిగేలా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని హరీశ్‌రావును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు తీవ్రనష్టం చేస్తున్న జీవో 33పై పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందవద్దని.. బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా అడ్మిషన్ల కోసం స్థానికతను నిర్ధారించుకోడానికి కొత్త సమగ్ర విధానం రూపొందించాని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి కమిటీని వేసి తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు.

ఉన్నమాటంటే ఉలుకెందుకు?

కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించకపోవటంతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టంగా మారిందని చెప్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కి పడుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 9 నెలల్లో గ్రామ పంచాయతీలకు 9 పైసలు కూడా చెల్లించలేదనేది అబద్ధమా? కేంద్రం నుంచి ఉపాధిహామీ, హెల్త్ మిషన్ పథకాల కింద వచ్చిన రూ.2,100 కోట్ల నిధులను గ్రామాలకు ఇవ్వకుండా దారి మళ్లించింది అబద్ధమా? 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.500 కోట్లు గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా ఆపింది అబద్ధమా? మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లుల కోసం చలో సచివాలయం పిలుపునిస్తే వారిని పోలీస్ స్టేషన్లలో నిర్బంధించింది అబద్ధమా? పారిశుద్ధ్య లోపంతో సీజనల్ రోగాలు ప్రబలడం అబద్ధమా? రెండు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, 8 నెలలుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వకపోవడం అబద్ధమా? బీఆర్ఎస్ హయాంలో జీపీలకు నెల నెలా రూ.275 కోట్లు, సంవత్సరానికి రూ.3,300 కోట్ల నిధులు విడుదల చేసింది నిజం కాదా? అని ప్రభుత్వాన్ని ఎండగట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

స్థానిక విద్యార్థులకు దారుణ అన్యాయం: చాడ

జీవో 33 వల్ల స్థానికత కోల్పోతున్న తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యవర్గస భ్యుడు చాడ వెంకటరెడ్డి గురువారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహకు లేఖ రాశారు. ప్రభుత్వ నిర్ణయంతో తెలంగాణలో పుట్టి, పెరిగిన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, 12 ఏండ్లు కష్టపడి చదివి ర్యాంకు సాధించిన విద్యార్థులకు నష్టం జరుగుతుందని వెల్లడించారు. 6 నుంచి 12వ తరగతి వరకు 7 ఏండ్ల కాలంలో గరిష్ఠంగా నాలుగేండ్లు ఎక్కడ చదివితే దానినే స్థానికతగా పరిగణించాలని సూచించారు. స్థానికత విషయంలో రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

ఢిల్లీకి వస్తే పార్టీని విలీనం చేసినట్టా?

- కోడిగుడ్డుమీద ఈకలు పీకడం ఇకనైనా ఆపండి
- భూమి ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుంది
- ఢిల్లీలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): 'మేము ఢిల్లీకి వస్తే మా పార్టీని బీజేపీలో విలీనం చేసినట్టా? ఢిల్లీకి మేం రాకూడదా?' అంటూ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేల అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో పోరాటం కోసం ఢిల్లీకి వచ్చామని, ఇకనైనా కోడిగుడ్డుపై ఈకలు పీకినట్టు నోటికొచ్చింది ప్రసారం చేయడం ఆపాలని కొన్ని టీవీ చానళ్లకు హితవు పలికారు. ఊహాజనితంగా కథనాలు రాయడం జర్నలిజానికి మంచిది కాదని, ఇలాంటి కథనాలు రాస్తున్నది.. ప్రసారం చేస్తున్నది ఎవరో కూడా అందరికీ తెలుసునని అన్నారు. 'ఇద్దరు ఎంపీలతో బీజేపీ ప్రస్థానం మొదలైంది. అలాగని ఆ పార్టీ అక్కడితో ఆగిపోయిందా? ఇప్పుడు మా పార్టీ కూడా అంతే. కొందరు డబ్బుకు ఆశపడి వెళ్లినంత మాత్రాన పార్టీ పని అయిపోయినట్టు కాదు' అని చెప్పారు. 'ఏ పార్టీకి అధికారం శాశ్వతం కాదు. ఆ మార్పు కూడా శాశ్వతం కాదు' అని వ్యాఖ్యానించారు.

భూమి ఉన్నంతకాలం బీఆర్ఎస్

బీఆర్ఎస్ బలహీనపడిందని వస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ప్రజలు 39 సీట్లు ఇవ్వడం అంటే బలహీనమైనట్టు కాదని అన్నారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ గెలుచుకున్నామని తెలిపారు. 'సూర్యచంద్రులు కిందమీదైనా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. భూమి ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుంది. మాకేంకాదు.. మేం ప్రజల తరపున కొట్లాడుతూనే ఉంటాం' అని స్పష్టంచేశారు. నాడు ఎమ్మెల్యేలు 'జై తెలంగాణ' అని ఉచ్చరించడానికి భయపడిన రోజుల్లో నికార్సైన ఉద్యమకారులుగా తామే గొంతెత్తి నినదించినట్టు గుర్తుచేశారు. ఇప్పటికీ ఎప్పటికీ బీఆర్ఎస్ బీజేపీలో విలీనం కాదనే విషయం గుర్తు పెట్టుకోవాలని, మీడియా ముసుగులో బట్టకాల్చి మీదెయ్యొద్దని, జర్నలిస్టులు విలువగల వ్యక్తులని, ఇలా పలుచన కావొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్ వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గీత కార్మిక కుటుంబాలను ఆదుకోండి

కర్ణాటకలోని సిర్సి పట్టణం వద్ద కొండచరియలు విరిగిపడి మృతిచెందిన ఏడుగురు గీత కార్మికులను, వారి కుటుంబాలను ఆదుకోవాలని మాజీ ప్రధాని దేవెగౌడను శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఢిల్లీలో దేవెగౌడను కలుసుకున్న శ్రీనివాస్‌గౌడ్ మృతుల కుటుంబసభ్యులకు ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బాలరాజు గుత్తేదార్, పర్వానంద స్వామి, బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.

- జీతాల కోసం ఉపాధ్యాయుల నిరసన

ఒకటో తారీఖున జీతాలు కలగానే మిగిలిపోయాయని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేశారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం మధ్యాహ్నం భోజన సమయంలో నిరసనకు దిగారు. ఇంతవరకు జీతాలు రాలేదని వాపోయారు. – ముత్తారం

ఒకటిన వేతనాలు ఉత్తిమాటే!

- మార్పు పేరిట కాంగ్రెస్ మోసం
- రేవంత్‌కు పాలనపై పట్టు లేదు
- బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఒకటో తేదీన ప్రభుత్వ చిరుద్యోగుల వేతనాలు ఇస్తున్నామన్న ప్రభుత్వ మాటలు ఉత్తిమాటలేనని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. కొన్ని శాఖల్లోని చిరుద్యోగులకు నెలలుగా వేతనాలు అందడం లేదని, కనీసం ఆగస్టు 15 నాటికైనా వేతనాలు చెల్లించాలని, ఒక నెత వేతనం బోనస్‌గా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీలను అమలు చేయాలని కోరారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది పరిస్థితి దయనీయంగా మారిందని, ఏడు నెలల నుంచి వారికి జీతాలే రావడం లేదని ధ్వజమెత్తారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి ఏడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, మాడల్ స్కూల్ టీచర్లకు జీతాలు ఇవ్వడమే లేదని తెలిపారు. జూనియర్ కళాశాలల అధ్యాపకులు, డిగ్రీ కాలేజీ గెస్ట్ లెక్చరర్లు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. జీతాలు పెంచాలని ఆశ వర్కర్లు కొన్నిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. చిరుద్యోగులంటే ప్రభుత్వానికి చిన్నచూపుగా మారిందని, సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టు రాలేదని ధ్వజమెత్తారు. మంత్రులకు తమ శాఖల బాధ్యతలే తెలియదని, మార్పు అంటూ కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. చిరుద్యోగుల వేతనాల విషయంలో ప్రభుత్వం స్పందించకుంటే వారి పక్షాన కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

తమ్ముడి కంపెనీతో ఒప్పందం తప్పెట్లయితది?

- అధికారిక మీటింగ్‌లో రేవంత్ అన్న తిరుపతిరెడ్డి బరాబర్ కూర్చుంటడు
- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై బీఆర్ఎస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మండిపడ్డారు. గురువారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన సొంత తమ్ముడు జగదీశ్వర్‌రెడ్డి కలిస్తే కూడా తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఆయనకు స్వచ్ఛ్ బయో కంపెనీ ఉందని, ఆ కంపెనీ ప్రారంభమై పదైదు నెలలు కూడా కాలేదని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఏబీసీడీ కూడా మొదలు కాలేదని, పెట్టుబడులు రానేలేదని తెలిపారు. వాళ్లే వచ్చి తెలంగాణలో పెట్టుబడులు పెడుతా అన్నారే తప్పా.. తెలంగాణ ఆస్తి మొత్తాన్ని దోచుకుంటామని అనలేదని పేర్కొన్నారు. దీనికి లేనిపోని అభూత కల్పనలు జోడించి సొంత తమ్ముడు కూడా ఉండకూడదనే విధంగా కుట్ర పూరిత ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. మరో తమ్ముడు కొండల్‌రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనపైనా బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది అధికారిక కార్యక్రమం కాదని, అయినప్పటికీ ఆ చైర్‌లో కూర్చుకున్నారు, ఈ చైర్‌లో కూర్చున్నారని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి మీటింగ్ పాల్గొనడం సర్వసాధారణమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా బరాబర్ పాల్గొంటారని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులపై బీఆర్ఎస్ అనవసర ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 8 నెలల్లో ఒక్కరోజైనా, ఒక్కచోటైనా సీఎం రేవంత్‌రెడ్డి తన సోదరులను ఇన్వాల్వ్ చేసినట్టు చూపితే అన్నింటికీ బాధ్యత వహిస్తా అని సవాల్ విసిరారు.

సర్కారుకు 'స్వచ్ఛ' సెగ!

- రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలపై అనేక అనుమానాలు
- కంపెనీల సమాచారాన్ని ఇవ్వని సీఎంవోపై విమర్శలు
- అమెరికా పర్యటనపై ఐఏఎస్‌లతో ప్రకటనలు
- నెట్టింట్లో వైరల్‌గా నమస్తే తెలంగాణ కథనం

'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'తో రేవంత్ ప్రభుత్వం ఒప్పందం.. ఫొటోలో కంపెనీ వాటాదారు హర్ష పసునూరి (మంత్రి శ్రీధర్‌బాబు పక్కన), సుగనిత్ సంస్థ ప్రెసిడెంట్ ప్రవీణ్ పరిపాటి (ఫైల్)

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం పెట్టుబడుల పేరిట ప్రకటిస్తున్న కంపెనీలపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ప్రఖ్యాత కంపెనీలను మాత్రమే ప్రభుత్వాలు ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్రాలకు ఆహ్వానిస్తాయి. దానికి భిన్నంగా.. నిన్నమొన్న ఏర్పాటు చేసిన అనామక కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకొంటున్నది. షేర్ క్యాపిటల్ లక్షల్లో కూడా లేని కంపెనీలు.. రూ. వేల కోట్లు పెట్టుబడులను పెట్టబోతున్నట్టు ఊదరగొడుతున్నది. ఇదే ప్రజల్లో సందేహాలు పెరుగడానికి కారణమైంది. ముఖ్యంగా సీఎం సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి చెందిన స్వచ్ఛ్ బయోగ్రీన్‌తో సర్కారు ఒప్పందం చేసుకోవడం, ఆ కంపెనీ వివరాలను మార్చేసి మరో కంపెనీగా సీఎం కార్యాలయం చిత్రీకరించడం, 17 రోజుల కిందటే ఏర్పడిన కంపెనీ రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులను పెడుతామని సర్కారుతో ఒప్పందం చేసుకోవడం.. పెను దుమారానికి దారితీసింది. బోగస్ కంపెనీలతో సర్కారు ఒప్పందాలు చేసుకున్నటున్నదని నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపించారు. పరువు కాపాడుకోవడానికి సర్కారు.. ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ వంటి ఐఏఎస్‌లతో ప్రకటనలను గుప్పిస్తున్నది. తెలంగాణ అభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను రాబట్టడంలో అమెరికా పర్యటన సజావుగా సాగుతున్నదని, ఒప్పందాలు, మీటింగ్‌లపై అపోహలేమీ పెట్టుకోవద్దని జయేశ్‌రంజన్ వివరణ ఇవ్వడమే దీనికి రుజువు.

సీఎంవో తీరుపై మండిపాటు

సీఎం రేవంత్ సోదరుడికి చెందిన స్వచ్ఛ్ బయోగ్రీన్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకొన్నది. ఆ వివరాలను దాచిపెట్టిన సీఎంవో.. 'స్వచ్ఛ్ బయోగ్రీన్' స్థానంలో 'స్వచ్ఛ్‌బయో' అనే అసలు ఉనికిలోనే లేని కంపెనీని తెరమీదకు తీసుకొచ్చి, ప్రభుత్వం ఒప్పందం చేసుకొన్నట్టు వెల్లడించింది. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొన్న కంపెనీల సమాచారాన్ని అధికారికంగా ప్రకటించాల్సిన సీఎంవో అరకొర వివరాలతో సమాచారాన్ని ఇవ్వడంపై నెటిజన్లు మండిపడుతున్నారు. పెట్టుబడుల ప్రక్రియలో తప్పులు జరుగకుంటే సీఎంవో ఎందుకు నిజమైన కంపెనీల పేర్లను వెల్లడించడంలేదని ప్రశ్నిస్తున్నారు.

నెట్టింట్లో 'నమస్తే' కథనం వైరల్

'తమ్ముడి పెట్టుబడి.. అన్న అగ్రిమెంట్' పేరుతో 'స్వచ్ఛ్‌బయో' కంపెనీ వెనకున్న చీకటి కోణాన్ని గురువారం 'నమస్తే తెలంగాణ' ఆధారాలతో బయటపెట్టింది. ఈ కథనంపై నెట్టింట పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ క్లిపింగ్స్‌ను సోషల్‌మీడియాలో పలువురు వైరల్ చేశారు. పెట్టుబడులపై రేవంత్ ప్రభుత్వం చెప్తున్న అబద్ధాలను కామెంట్ల రూపంలో ఎండగట్టారు.

పెట్టుబడుల కోసమే సీఎం పర్యటన: మంత్రి పొన్నం

భీమదేవరపల్లి, ఆగస్టు8: తెలంగాణ ప్రయోజనాల కోసమే సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా టూర్ వెళ్లారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా అమెరికాకు వెళ్తే బీఆర్ఎస్ నేతలకు కండ్లు మండుతున్నాయని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు చీఫ్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ, ఐటీ, పరిశ్రమల శాఖ అధికారులు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకే అమెరికాకు వెళ్లారని తెలిపారు. ప్రజాపాలన పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి దేశ ఎల్లలు దాటి వెళ్తే కుటుంబపరమైన అంశాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ చులకన చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీలు వేరు కాదని, ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు.

హైదరాబాద్‌కు చార్లెస్‌స్క్వాబ్

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఆర్థిక సేవల్లో పేరుపొందిన చార్లెస్‌స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఆ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్‌హోవార్డ్, రామబొక్కా, ప్రతినిధులు సమావేశమై ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. చార్లెస్ స్క్వాబ్ కంపెనీ భారత్‌లో నెలకొల్పనున్న తొలి కేంద్రం ఇదే. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో రూ.400 కోట్ల పెట్టుబడితో ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు వివింట్ ఫార్మా కంపెనీ ముందుకొచ్చింది. తద్వారా వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ విషయమై వివింట్ ఫార్మా ప్రతినిధులు సీఎం రేవంత్ బృందంతో చర్చలు జరిపారు. కంపెనీ విస్తరణకు మద్దతు ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసి డల్లాస్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాను సందర్శించారు. అక్కడ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- కాళేశ్వరంలో కొనసాగుతున్న ఎత్తిపోతలు



కాళేశ్వర గంగ పరవళ్లు తొక్కుతున్నది. ఎల్లంపల్లి నుంచి తరలివస్తున్న జలాలు మధ్యమానేరు మీదుగా అన్నపూర్ణ, సిద్దిపేట జిల్లా రంగనాయనాయక సాగర్‌కు పరుగులు తీస్తున్నాయి. దిగువన కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2లోని నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా పెద్దపల్లి జిల్లాలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, 3, 5 మోటర్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లాలోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. –ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట

మల్లన్నసాగర్‌లోకి కాళేశ్వరం జలాలు

కొండపోచమ్మసాగర్‌లోకి నీటి పంపింగ్.. కేటీఆర్, హరీశ్‌రావు పోరాటంతో గోదావరి పరుగులు

తొగుట/మర్కూక్, ఆగస్టు 8: మల్లన్నసాగర్ ప్రాజెక్టులోకి మళ్లీ గోదావరి పరవళ్లు మొదలయ్యాయి. బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కృషితో కాళేశ్వరం నీళ్లు కదిలొచ్చాయి. ఇటీవలె బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఆలోచనను పక్కన పెట్టాలని.. కాళేశ్వరం జలాలను పంపింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు గడువు ఇస్తున్నామని, అప్పటికీ లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల చేయకుంటే 50వేల మంది రైతులతో వచ్చి తామే మోటర్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా రాజకీయాలు కాకుండా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రంగనాయకసాగర్, మల్లన్న సాగర్‌లోకి నీటిని విడుదల చేయాలని సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ వెంటనే మల్లన్నసాగర్‌కు నీటిని విడుదల చేస్తామని సాగునీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా ప్రకటించారు. లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలు అనంతరగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్‌కు చేరుకున్నాయి. గురువారం తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి అధికారులు నాలుగు పంపులను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోస్తున్నారు. ఒక్కో పంప్ నుంచి 0.432 టీఎంసీల నీటిని మల్లన్నసాగర్‌లోకి పంపిస్తున్నారు. అలాగే మల్లన్నసాగర్ నుంచి గురువారం ఒక మోటరును ఆన్ చేయడంతో గోదావరి జలాలు కొండపోచమ్మ సాగర్‌లోకి పరుగులు పెట్టాయి.

మల్లన్న సాగర్ నుంచి దిగువకు పారుతున్న జలాలు